క్లుప్తంగా

చైర్మన్ పదవి స్థానికులకే ఇవ్వాలి

ఐనవోలు : మల్లికార్జునస్వామి ఆలయ చైర్మన్ పదవిని మండలానికి చెందిన వ్యక్తికే ఇవ్వాలని మాదిగల ఐక్య సంక్షేమ సంఘం (మాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దెపాక రవీందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. ఉమ్మడి వర్ధన్నపేట మండలం నుంచి ఐనవోలు మండలం ఏర్పడిన తర్వాత ఇల్లంద మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వర్ధన్నపేట మండలానికి చెందిన వారికి, ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ చైర్మన్ పదవిని ఐనవోలు మండల వాసులకు కేటాయిస్తే న్యాయంగా ఉంటుందన్నారు. ఇలా చేస్తే ఇరు మండలాల నాయకులను సంతృప్తి పరచే విధంగా ఉంటుందన్నారు. కానీ రాజకీయ అవసరాల రీత్యా ఐనవోలు మండల ప్రజలకు అన్యాయం చేసే విధంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. అధికారం కోల్పోయినపుడు రాజకీయంగా ఒత్తిడి ఎదురైనా ఐనవోలు మండల నాయకులు కాంగ్రెస్ పార్టీ వెంటే ఉన్నారని గుర్తు చేశారు. అలాంటి వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా ఇతర మండలానికి చెందిన వారికి ఆలయ చైర్మన్ పదవిని కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే పునరాలోచన చేసి చైర్మన్ పదవిని ఐనవోలు మండల వాసులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 3న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. పోచమ్మకుంట, శ్రీనగర్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, హనుమాన్ నగర్ డబ్బాల ప్రాంతంలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, టెంపుల్ ట్రీ విల్లాస్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి: ఎల్లాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ అశోక్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు, రేపు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: ధర్మసాగర్ నుంచి వచ్చే తాగునీటి ప్రధాన పైపులైన్‌కు మరమ్మతుల కారణంగా శుక్ర, శనివారాల్లో వరంగల్ అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో తాగునీటి సరఫరా ఉండదని ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. కరీమాబాద్ నాగమయ్య టెంపుల్, నాగేంద్రనగర్, శివనగర్, చింతల్, ఖిలా వరంగల్ తూర్పు కోట, ఖిలా వరంగల్ మధ్యకోట, మైసయ్య నగర్, శాకరాసికుంట ప్రాంతాల్లో నీటి సరఫరా బంద్ ఉంటుందని పేర్కొన్నారు.

నేటి నుంచి డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు

విద్యారణ్యపురి: ఈనెల 3, 4వ తేదీల్లో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు గోదావరిఖనిలో జరగనున్నాయని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి తిరుపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్లీనరీ సమావేశాల్లో నిరుద్యోగ భృతి సాధన, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాట కార్యక్రమాల కార్యాచరణను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.

వీధి నాటక వీరుడు హష్మీ

ఖిలా వరంగల్: వీధి నాటకాన్ని పోరాట ఆయుధంగా మార్చిన వీరుడు హష్మీ అని ప్రజానాట్య మండలి వరంగల్ జిల్లా కార్యదర్శి వి.దుర్గయ్య అన్నారు. పీఎస్ఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ శివనగర్‌లో సఫ్దర్ హష్మీ వర్ధంతి సందర్భంగా హష్మీ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. హష్మీ అభ్యుదయ నాటక రచయిత, దర్శకుడు, నటుడు గీత రచయిత అని దుర్గయ్య కొనియాడారు. కార్యక్రమంలో పీఎస్ఎం జిల్లా నాయకులు రవి, జానీ, రాజు, మొగిళి, అశోక్, రమేష్, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఫిషర్‌మెన్ కమిటీ సభ్యుడిగా మండల సమ్మయ్య

హన్మకొండ అర్బన్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఫిషర్‌మెన్ కమిటీ పాలక మండలి సభ్యుడిగా హనుమకొండకు చెందిన మండల సమ్మయ్యను నియమిస్తూ కమిటీ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ మండలం వడ్డేపల్లికి చెందిన సమ్మయ్య ముదిరాజ్.. కాంగ్రెస్ పార్టీ నుంచి గత గ్రేటర్ ఎన్నికల్లో పోటీ చేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన నాయకులకు సమ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు.

బీసీటీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా సాంబమూర్తి

కాజీపేట: బీసీ టీచర్స్ యూనియన్ (బీసీటీయూ) వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కాజీపేట పట్టణానికి చెందిన పెరుమాండ్ల సాంబమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నియామక ఉత్తర్వులను ఫాతిమానగర్ కాలనీలో గురువారం అందజేశారు.

పార్కింగ్ స్థలాల ఆక్రమణ



కూరగాయల మార్కెట్ రోడ్డులో ఆక్రమణకు గురైన పార్కింగ్ స్థలం



వెల్లంపల్లి వెళ్లే రోడ్డుకు ఆనుకుని ఏర్పాటు చేసిన షెడ్డు

- కమిషనర్ హెచ్చరించినా పట్టించుకోని వ్యాపారులు
- కిరాణా సామగ్రితో నిండుతున్న పార్కింగ్ స్థలాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

పరకాల : రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే సహించే ప్రసక్తే లేదని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించినా కొందరు వ్యాపారుల తీరులో మార్పు రావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని రోడ్లపై చేపలు, కూరగాయలు, పండ్లు విక్రయించే చిరువ్యాపారాలను తొలగించి కూరగాయల మార్కెట్‌లోకి తరలించిన మున్సిపాలిటీ సిబ్బంది.. కొందరు పెద్ద వ్యాపారులపై చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరకాల మార్కెట్ రోడ్డులోని అనేక మంది కిరాణ వ్యాపారస్తులు రోడ్లపై దుకాణాల సామగ్రిని ఉంచడడంతో పార్కింగ్ స్థలం కరువై ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వినియోగదారులు, వాహనదారులు వాపోతున్నారు. ఇదే రోడ్డు సివిల్ ఆస్పత్రికి వెళ్లే మార్గం కావడంతో ఒక్కో సమయంలో అంబులెన్స్ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని పలువురు ఆగ్రహిస్తున్నారు. పట్టణంలోని భూపాలపల్లి రోడ్డు, హుజూరాబాద్ రోడ్డు, వెల్లంపల్లి రోడ్డు, బస్టాండ్ ఎదుట చాలా మంది వ్యాపారులు రోడ్లు, పార్కింగ్ స్థలాలను ఆక్రమించి షెడ్లు నిర్మించి సామగ్రిని విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో వాహనాలు నిలిపే చోటులేక రోడ్లపై నిలపడంతో పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. అయితే పది రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ సుష్మా రెండు రోజుల గడువు విధించి ఆక్రమణలో ఉన్న స్థలాలను ఖాళీ చేయాలని, దుకాణాల బోర్డులు తొలగించాలని హెచ్చరించినా తమకేం సంబంధం లేదన్నట్లు కొందరు వ్యాపారస్తులు వ్యవహరించడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని పలువురు చర్చించుకుంటున్నారు.

పైరవీలు..

అయితే కొందరు వ్యాపారస్తులు తమకు దగ్గరగా ఉన్న రాజకీయ నాయకులతో మున్సిపల్ అధికారులకు పైరవీలు చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కానీ స్థానికులు మాత్రం వ్యాపారస్తులు, వారికి అండగా నిలుస్తున్న రాజకీయ నాయకులపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కఠినంగా వ్యవహరించి పార్కింగ్ స్థలాలపై వెలసిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి



రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేసే వారిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో భవిష్యత్‌లో రోడ్లు మరింత ఆక్రమణకు గురై కనీసం పార్కింగ్ స్థలాలు కనిపించకుండ పోతాయి. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు అధికారులు చర్యలకు వెనుకడుగు వేయొద్దు.

- బొచ్చు చిన్ని కృష్ణ, అంబేడ్కర్ యువజన సంఘం నాయకుడు

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి భిక్షపతి



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక శివారులో పేదలు ఏర్పాటు చేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గుడిసెవాసుల సమావేశం మండల కార్యదర్శి బత్తిని సదానందం అధ్యక్షతన జరుగగా ఆయన హాజరై మాట్లాడారు. నిరుపేదలు గుడిసెలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారని, వారందరూ ఇళ్ల స్థలాల కోసం, ఇళ్ల నిర్మాణం కోసం ఏళ్ల తరబడి పోరాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు, బడుగు బలహీన వర్గాల జీవనం మారలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా గాలికి వదిలేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి అనుకారి అశోక్, నాయకులు గుంటి రాజేందర్, వొల్లాల రమేష్, ఎండీ అంకుషావలి, బండారి సాంబయ్య, చెరుపెల్లి కొమురయ్య, పల్లా అనిల్, గాజు కొమురయ్య, బోగి రమాదేవి, తీగల కల్పన, గోవింద్ సృజన, గుడిసె వాసులు పాల్గొన్నారు.

వైభవంగా ‘సారె’ మహోత్సవం



సారె మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో గురువారం ధనుర్మాసం ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి సారె మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఆరుట్ల మాధవ మూర్తి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. భక్తులు భజన సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో భజన మండలి, వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుడుంబా విక్రయిస్తే కేసులు



ఆత్మకూరు : గుడుంబా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ సంతోశ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని బ్రాహ్మణపల్లి వద్ద వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో నల్లబెల్లి మండలం రేలకుంటకు చెందిన మాడు పైడి 62 లీటర్ల గుడుంబాను ద్విచక్ర వాహనంపై తరలిస్తున్నట్లు తెలిపారు. అనుమానితంగా కనిపించిన అతడిని తనిఖీ చేయగా గుడుంబా లభించిందని పేర్కొన్నారు. గుడుంబాను, వాహనాన్ని సీజ్ చేసి పైడిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. సీఐ వెంట ఎస్సై తిరుపతి ఉన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : గుడుంబా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై పరమేశ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జోగంపల్లిలో గురువారం పెట్రోలింగ్ చేస్తుండగా గ్రామ శివారులోని చలివాగు ప్రాజెక్టు కట్ట వద్ద ఇద్దరు అనుమానిత వ్యక్తులు పోలీసులను చూసి సంచి పడేసి పారిపోతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. సంచిని తనిఖీ చేయగా 20 లీటర్ల గుడుంబా లభ్యమైనట్లు పేర్కొన్నారు. సూర్యనాయక్‌తండాకు చెందిన నాగవత్ రాహుల్, బానోతు నరేష్ 20 లీటర్ల గుడుంబా తరలిస్తుండగా వారిని జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టు కట్ట వద్ద పట్టుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఎవరైన గుడుంబా తయారు చేసినా విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

30 గ్రాముల గంజాయి పట్టివేత

మండలంలోని గోవిందాపూర్ వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు స్కూటీపై తారసపడినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. వారిని తనిఖీ చేయగా 30 గ్రాముల గంజాయి లభించగా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఏనుమాముల మార్కెట్ సమీపంలోని ముసలమ్మకుంట, బాలాజీనగర్‌కు చెందిన దారంగుల దేవేందర్, కొండపల్లి రాకేశ్, దారంగుల సతీష్‌కుమార్ గంజాయిని విక్రయించేందుకు స్కూటీపై పరకాలకు వెళ్తున్నట్లు తెలిపారు. త్రిపుల్‌రైడింగ్‌కు పాల్పడుతూ అనుమానస్పదంగా కనిపించడంతో తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. దీంతో వారి వద్ద 30 గ్రాముల గంజాయి లభించగా స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. యువకులు వ్యసనాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైన గంజాయి విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని, పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొప్పూర్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు. గురువారం వాహనాల తనిఖీ చేపట్టామని ఈ క్రమంలో కొప్పూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి మహేశ్ అనే వ్యక్తి అనుమతి లేకుండా కొప్పూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఈ సందర్భంగా ఎస్సై పేర్కొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సంగీత ఎంపిక



రూ.5 వేలు సాయం అందజేసిన సీఐ హరికృష్ణ

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన మౌటం సంగీత గతేడాది డిసెంబర్ 30న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైంది. ఈనెల 5న జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననుంది. నిరుపేద కుటుంబానికి చెందిన సంగీత గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి హ్యామర్‌త్రో విభాగంలో జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన సందర్భంగా సంగీతను స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎల్కటూరి హరికృష్ణ అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో పుట్టిన సంగీత ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం మండలానికి గర్వకారణమన్నారు. సంగీత జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించి పతకం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంగీత తండ్రి మౌటం శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ మౌటం రమేశ్, నాయకులు కొలిపాక తిరుపతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జితేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జితేందర్‌రెడ్డి

దామెర : పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి కొండి జితేందర్‌రెడ్డి సూచించారు. ల్యాదెళ్లలో గురువారం మండల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో మండల అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందన్నారు. ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు కృషి చేసే వ్యక్తిని మండల అధ్యక్షుడిగా ఎన్నుకోనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కాచం గురుప్రసాద్, మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, నియోజకవర్గ కోకన్వీనర్ మాదారపు రతన్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజ్‌కుమార్, నాయకులు బుచ్చిరెడ్డి, పిట్టల రమేశ్, కొట్టె రమేశ్, శక్తికేంద్రం ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో తీరిన నీటి సమస్య



ట్యాంకును పరిశీలిస్తున్న ఈఈ వీరభద్రం

దామెర : మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డు వద్ద గల బాలసముద్రం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఎట్టకేలకు నీటి సమస్య తొలగింది. కొద్ది రోజులుగా విద్యార్థులు నీటి ఎద్దడి కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా ఈ విషయమై జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు పాఠశాలను పరిశీలించి శాశ్వత పరిష్కారం కోసం అధికారులకు పలు సూచనలు చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాఠశాల ఆవరణలో నూతన ట్యాంకు నిర్మాణం పూర్తిచేసి, సమీప వ్యవసాయబావి నుంచి మోటర్ల ద్వారా నీటిని ట్యాంకులోకి విడుదల చేశారు. కాగా గురువారం ఏటూరునాగారం ఐటీడీఏ ఈఈ వీరభద్రం పాఠశాలను పరిశీలించి మాట్లాడారు. నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం తీసుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపల్ సురేందర్‌రెడ్డి, వార్డెన్ శ్రీమతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



ఐనవోలు : మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



శాయంపేట : తిలక్‌బాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

ఐనవోలు : వివిధ కారణాలతో మృతిచెందిన వారి బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో రాజరపు మల్లయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మల్లయ్య మృతదేహానికి నివాళులర్పించారు. అదే విధంగా మండల కేంద్రంలోని శాతనాల పుష్పలత, బరిగెల రత్నం, కత్తుల నాగలక్ష్మి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. పున్నేలు గ్రామంలో రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందిన జిల్లా గోపి చిత్రపటానికి పూలమాల వేసి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్, రాయపురం సాంబయ్య, నకరకంటి మోహన్, బొల్లెపల్లి మధు, ఇల్లందుల ఎలిషా, యాకర సాంబయ్య, కొత్తూరి సునీల్, కత్తి సుధీర్, భాస్కర్, సారయ్య తదితరులు ఉన్నారు.

పాత్రికేయుడి కుటుంబానికి పరామర్శ

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు బాల్నె తిలక్‌బాబు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండల కార్యదర్శి బత్తిని సదానందం, మండల సహాయ కార్యదర్శి అనుకారి అశోక్, నాయకులు గుంటి రాజేందర్ ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

మండల కేంద్రానికి చెందిన అబ్బు భాస్కర్‌రెడ్డి బుధవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. భాస్కర్ రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారివెంట పరకాల ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మారేపల్లి నందం, మాజీ ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మారేపల్లి మోహన్, గ్రామశాఖ అధ్యక్షుడు గాజె రాజేందర్, నాయకులు కరణ్‌బాబు, సుమన్, ప్రమోద్ తదితరులు ఉన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

దామెర : భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొమ్ముల కరుణాకర్ అన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా గురువారం వివిధ గ్రామాలను సందర్శించి రాజ్యాంగంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువల పరిరక్షణ ప్రచార ఉద్యమం 60 రోజుల పాటు చేపడుతున్నట్లు వెల్లడించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు.

ఈసీ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా కార్తీక్



కమలాపూర్ : గ్రామీణ అభివృద్ధి శాఖ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ (ఈసీ) యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా కమలాపూర్ మండల ఈసీ కార్తీక్ ఎన్నికయ్యారు. ఈసీ యూనియన్ పాత కార్యవర్గం పదవికాలం ముగియడంతో గురువారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్ (ఎల్కతుర్తి), ఉపాధ్యక్షుడిగా రాము (ఆత్మకూరు), కోశాధికారిగా శ్రీను (ధర్మసాగర్) ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు డీఆర్డీఓ మేన శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు ఈజీఎస్ ఓపెన్ ఫోరం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఈజీఎస్ ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు.

ఘనంగా అయ్యప్ప ఇరుముడి పూజలు



ఖిలా వరంగల్: ఇరుముడితో మాలధారులు



కాజీపేట: శబరిమలకు తరలిన మాలధారులు

ఖిలావరంగల్: వరంగల్ రంగశాయిపేట రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అయ్యప్ప గురుస్వామి కే.నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప ఇరుముడి పూజ గురువారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు వెలిదె ప్రదీప్‌శర్మ.. ఇరుముడి పూజ నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలధారులు శబరిమలకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్, రంజిత్, పవన్, భవిత్, శ్రీధర్, రాంబాబు, భిక్షపతి, మాధవ్, మనీ, రాహుల్, మనోహర్, మణిదీప్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో..

కాజీపేట: అయ్యప్పస్వామి దేవాలయ ఆవరణలో గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడి ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల దీక్షలు పూర్తి చేసుకున్న అయ్యప్ప మాలధారులు ఆలయంలో ఇరుముడి ధారణ చేశారు. అనంతరం 25 మంది దర్శనం కోసం శబరిమలకు తరలి వెళ్లారు. పూజలో బుర్ర జనార్దన్ గౌడ్, బంగారు కుమారస్వామి, కోటగిరి సంపత్ కుమార్, విజయ్ కుమార్, సురేష్, పాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

మడికొండ: ఒడిశా రాష్ట్రం సుచర్నపూర్ జిల్లా బినిక గ్రామానికి చెందిన సూర్యకార్ (35) అదృశ్యమైనట్లు మడికొండ పోలీసులు తెలిపారు. కాజీపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎండీ.సర్వర్‌కు చెందిన ఇటుకబట్టీలో పని కోసం వచ్చి గతనెల 29న సాయంత్రం బియ్యం తీసుకొస్తానని చెప్పి బయటకు వచ్చి తిరిగి వెళ్లలేదు. దీంతో భార్య దేవకీకార్ చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

పట్టుదలతో చదివి జీవితంలో రాణించాలి



కాజీపేట: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే శ్రద్ధగా చదివి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఎస్సై శివకృష్ణ సూచించారు. గంజాయి, డ్రగ్స్, గుట్కా, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. కాజీపేట డంకెన్ బాబా ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జాగృతి పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. కళాకారులు ఆటపాటలతో సమాజాన్ని పీడిస్తున్న రుగ్మతలపై ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, విలియం, వెంకటేశ్వర్లు, పూల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.